యథాప్రజా-తథారాజా

బలివాడ కాంతారావు

సిగ్నల్ వాలలేదు. రైలు ఆగింది. రెండు వైపుల నించీ మనుషులు దాడిచేసారు. తలపై కమలాపండ్ల బుట్టలతో అమ్మడానికి పరు గెత్తుతూ కదలుతున్నారు.

రైల్లో వున్న మనుషులు తలోలా వాఖ్యా నించారు

"వీళ్ళకోసమే రైలాపినట్లుంది"

"ఈ చుట్టుపట్ల కమలాలు తెగకాసి కుళ్ళి పోతుంటే యెలాగో అమ్మకేంచేస్తారు?"

"ప్రతిరైలూ ఆపమని ఆ స్టేషనుమాస్టరుకు లంచం కట్టిసుంటారు."

ఇంతలో రెండుప్రక్కలా పళ్ళమ్మేవాళ్ళని తరిమే పోలీసులను చూడగానే

"ఇదేదో పెద్ద రాకెట్‌లా వుందే" అని ఒక ప్రయాణికు డంటే

"అధార్టీ చూపిస్తున్నారు అంతే"

ఇంకోకాయన సన్నంగా పొడుగ్గావున్నాడు. కళ్ళి లాల్చి వేసుకున్నాడు. రిమ్‌లెస్ కళ్ళ ద్దాలు మాటాడితే సర్దుకుంటున్నాడు. అతని దృష్టి పళ్ళపై లేదు. ఆ పళ్ళవాళ్ళ దగ్గర ఒకొక్కక్క కమలా పండుని దండుకుని, అమ్ముకోండని విడిచిపెడ్తున్న ఒక హెడ్ కానిస్టేబుల్ మీద వుంది.

ఆ హెడ్‌కానిస్టేబుల్ ఒక చేతిలో లాటీ వుంది. ఇంకోచేతిలో సంచివుంది. లాటీ తిప్ప కుండా ఒకొక్కక్క కమలాపండూ పడగానే సంచి నిండుతోంది. హెడ్డుకు బొద్దుమీసా లున్నాయ్. చెమటలు పోస్తున్న ఫాలభాగంలో మూడు ముడతలు కనిపిస్తున్నాయి.

"ఇది దోపిడీ—నిలువు దోపిడి—అధికార దుర్వినియోగం!" ఇలా అరచిన సన్నని మనిషి గొంతుక అందరికీ వినిపించింది. హెడ్డు తన గురించే అతను అలా అంటున్నాడని ఒకసారి ఆ గుండ్రని కళ్ళు నిలబెట్టిచూసాడు ఆ సన్నని ప్రయాణీకునికి, యెర్రటోపీ యెరుపు కళ్ళంటే భయంలేదన్నట్లు యింకా అరుస్తున్నాడు

అతను యింత అరచినా, యింతమంది కళ్ల తనమీద వున్నా హెడ్డు తనపని తను చూసు కుంటూ తిరిగి వచ్చేసరికి యీ సన్నని మనిషి పళ్ల బేరంలో వున్నట్లు గమనించాడు.

"బుట్ట ఎంత?"

"పదిహేను రూపాయలు బాబూ.'

"ఇచ్చే ధర చెప్పు."

"రెండు తగ్గించి పదమూడు చేసుకోండి"

"ఆ పది కొట్టే? మూడురూపాయలిస్తాను"

"కాశ్మీర్ సుందరి బుగ్గల్లా వున్న—యీ నాగపూర్ సంత్రాలకు తమరు విలువ కట్టలేరు" అని వెళిపోతుంటే—

"పోనీ నాలుగు చేసుకో"

"వెధవా—ఆ బాబు దోపిడీ యెరగని అధి కారిరా! ఇచ్చెయ్" అని హెడ్డు గసిరాడు. గసిరి వూరుకున్నాడా? ఆ బుట్టలో సున్న పెద్ద కమలాపండును తీసుకుని సంచిలో వేసు కున్నాడు.

రిమ్‌లెస్ కళ్ళద్దాల వెనుక సున్న కళ్ళు మండిపోయాయ్. ఇంతలో రైలు ఈలవేసింది.

"ఛే"

"పదికి తక్కువ లేదు."

"ఐదిస్తాను."

"మీ వూర్లో యీ బుట్టడు పళ్ళు ఖరీదు పాతిక—"

"ఇంకో అర్ధరూపాయి తీసుకో "

"అరిచ్చేండి."

రైలు మెల్లగా కదులుతోంది. ఇంకా బేరం తెగలేదు. రైలుతోపాటు కదులుతూ "డబ్బులు తియ్యండి—ఇదండి బుట్ట"

"ఇద—ఐదున్నర "

బుట్ట రైలెక్కింది కుర్రాడు ఐదున్నర అందుకుని మెట్లుదిగిపోయాడు. రైలు కదిలిపోయింది.

ఆ రెండో తరగతి కంపార్టుమెంటులో అందరికళ్ళు అతనిమీదే వున్నాయ్—ఒక్కరి కళ్ళు తప్పించి: ఆ ఒక్కడూ హెడ్ కానిస్టేబుల్ కమల్‌నాథ్ తివారీ' పళ్ళబుట్ట కొన్నవాడు వేణుగోపాలన్.

అందరూ చొగ్గా కొట్టేసావంటున్నారు. ఒక పండు తీసి తినడానికి వేణుగోపాలన్‌కు చేతులు రావటంలేదు. తన వూరు తీసుక వెళ్ళవచ్చు. ఇంట్లో పిల్లలూ పెళ్ళాం మూడురోజులపాటు తింటారు. ఇక్కడ ఒక్కడు తిన్నట్లు కాదు. తనచుట్టూ పిల్లలున్నారు. పిల్లల తల్లులున్నారు. ముసలివాళ్ళున్నారు. పళ్ళు యిస్తే యెవరికి వద్దు?

భద్రంగా దాచుకోబోతుంటే, ఒక మూల కూర్చొని పండుమీద పండు వలుచుకు తింటున్న హెడ్డు తివారీ గొంతుక వినిపించింది.

"పళ్ళు నాణ్యం చూడండి-లెఖ్ఖపెట్టుకోండి"

"పోపోస్-అప్పణంగా వచ్చాయి కదా-తెగ ఆరగిస్తున్నాడు. వీడు చెప్పితే తను లెఖ్ఖపెట్టుకోవడం యేమిటి!" అనుకుని వేణుగోపాలన్ వూరుకుంటే స్టేషను వచ్చింది. ఆ చిన్నస్టేషను దగ్గర రైలు ఆగిపోయింది. అటునించి రైలు వస్తోందన్నట్లు అటు సిగ్నల్ వాలివుంది.



ఎవరో రైల్లో వాడే ప్రశ్నించాడు—

"ఏమండీ—ఐదున్నరకు ఆరు డజన్లేనా కిట్టాయా?"

"ఏమో?"

"అతన్ని యెవ్వరూ దోపిడి చెయ్యలేరు!" అంటూ హెడ్డు అనగానే—ఈ వేళాకోళం సహించలేక,

"నేను తెలివితక్కువవాడ్ని కాను" అన్నాడు వేణుగోపాలన్.

"నేను అంతమాట వాడలేదుసార్! ఆ బుట్ట పాముల పుట్టలావుంది. ఏమో—లోపల ఎన్ని పాములున్నాయో? నా కెందుకులెండి" అంటూ యింకో పండు-అరమగ్గిన పండు చేతినిండుగా వున్న పండు వలిచి తింటున్నాడు. ఆ పండు తన బుట్టనించి తీసుకున్నదే. అంత పెద్దపండు తను తినవలసింది. వాడు ఆరగిస్తున్నాడు.

"పోనీ లెఖ్ఖపెట్టండి" అంటూ యెవరో సలహా యివ్వటంవలన వేణుగోపాలన్ బుట్ట సీటుమీదకు దింపాడు. నలుగురి కళ్లూ బుట్ట మీదే వున్నాయ్. ఒక్కసారి పెదాలు గట్టిగా కరిచిపట్టుకున్నారు. కొందరు నవ్వు నాపుకున్నా వేణుగోపాలన్ కోపాన్ని ఆపుకోలేక

"మోసం-దగా-దోపిడీ" అని అరిచాడు. హెడ్డు తీసిన తేనుపు పకపక నవ్వినట్లుంది.

"బుట్ట పెద్దదే "

"అడుగున సగం గడ్డి"

"గడ్డిమీద సగం కుళ్ళిన పళ్ళు."

"మంచివి మీద నున్నయ్. వాటి ఖరీదు రెండు మూడు రూపాయిల కన్నా మించి వుండదు."

"మోసం దగా "

చుట్టూ మనుషులు మూగిపోయారు.

"ఇలాంటి మోసం అనే యీ పోలీసుల్ని పంపించారు."

"ఎవడో పెద్ద పోలీసు ఆఫీసరు యీయన లాగే మోసపోయివుంటాడు. అందుకే, అసలు డ్యూటీలు తప్పించి యిక్కడికి పోలీసుల్ని పంపించాడు."

"పోలీసు ఆఫీసరుకు కొనేఖర్మ యెందుకు? ఏ మినిష్టరు చప్రాసీయో, దగాపడి వుంటాడు. వాడు మినిష్టరుతో చెప్పి పోలీసు బందోబస్తు చెయ్యించి వుంటాడు."

"మనలాంటి ప్రయాణీకులే కంప్లయింటు యిస్తే, పోలీసుల్ని వాళ్ళని తరమడానికి పంపించి వుండకూడదా?"

"అధికారుల్లో అంత నిజాయితీ వుంటే—దేశం యెందుకిలా తగలబడుతుంది?"

"యథారాజా—తథాప్రజా"

"యథాప్రజా—తధారాజా..." అని హెడ్ అనగానే అందరికీ కోపం వచ్చి అతనివేపు కొరకొరా చూసారు. హెడ్డు పట్టించుకోకుండా యింకో పండు సంచిలోనించి తీసాడు.

"అప్పణంగా వచ్చాయి కదా. ఎన్నయినా తింటాడు" అని గొణిగాడొకడు. జవాబు చెప్ప కుండా ఆ పండు తినేసి చేతులు కడుక్కుని మీసా లొకసారి తడుముకుని, తుడుచుకుని మళ్ళీ కూర్చున్నాడు.

"వెధవ రైలు యింకా కదలదు!"

"అటువేపు నించి వచ్చే రైలు డిరైల్ అయిందేమో?"

"ప్రక్క స్టేషను పెద్దది. అక్కడ రైలాగ నివ్వండి కంప్లయింట్ రాద్దాం"

"ఏమని?"

"ఎవడికి అధికారం యిస్తే, వాడు సరిగ్గా చేస్తేనా?"

"ఎవడా వాడు?"

"ఈ స్టేషను మాష్టరు—ఈ రైలింజను డ్రైవరు—గార్డు."

"అదిగో ఆ పోలీసులు "

"తివ్వలాగితే డొంకంతా కదులుతుంది. ఏది సవ్యంగా పోతోంది? ఎవడిదగ్గర అనెస్థీషి గూడు కట్టుకుని కూర్చుంది?"

"మా తిండి, మా గుడ్డ, మా చదువు, మా వుద్యోగం, మా యిల్లు, మా నిద్ర, మా ప్రేమ, ఒకటేమిటి మా గురించి అన్నీ యీ రోజుల్లో అధికారం వున్నవాడి చేతుల్లోనే వుంది" అని ఒకడంటే—

హెడ్ ఒక ప్రశ్న వేసాడు.

"మీ ముడ్డీ అధికారే కడగాలా?"

అందరికీ కోపంవచ్చి కళ్ళు నిలబెట్టి అతని వేపు చూస్తే హెడ్‌కి నవ్వొచ్చింది. లంచాలు తిన్నవాడు యీ గుంపుమీద బ్రహ్మాస్త్రంలా యింత పెద్ద ప్రశ్న వెయ్యటం నచ్చలేదు వాళ్ళకి. హెడ్డు నిల్చున్నాడు.



"నాది ముప్పయ్యేళ్ళ సార్వీసు. అధికారం అంటే దెయ్యం. అది మోసినోడి బాధ మీకేం తెలుసు?"

"బాధే-కమలాపళ్ళు కొనకుండా తినొచ్చు." అన్నాడు వేణుగోపాలన్.

"చెప్పండి—మీలో యెందరికి అధికారం లేదో?"

"మాకే వుంటే-అన్యాయాలు జరగకుండా చూసేవాళ్ళం! అన్యాయం అని తెలిసి, అన్యాయాన్ని యెంకరేజ్ చేసి, నాలాంటి మంచి వాళ్ళని మోసంచేసి, అధికారం దుర్వినియోగం చేస్తున్నావు" అరిచాడు వేణుగోపాలన్.

"మేమంతా చట్టంకి కట్టుబడి బ్రతికేవాళ్లం. అందుకే అధికారులు మమ్మల్ని రక్షిస్తారని వెళ్తే మమ్మల్ని వారు భక్షిస్తున్నారు" అన్నాడింకొకడు మెల్లగా.

"అయితే మీరంతా అబద్ధం చెప్తున్నా"రన్నాడు హెడ్డు.

"అది చేతనైతే, నీలానే కమలాపళ్ళు తినే వాళ్ళం."

"మీకు అధికారం లేదనకండి. మీకు ఓటున్నంత కాలం అధికారంవుంది. ఈ ఓటు మీకు నచ్చే అధికారం యెన్నుకునే వోటు. మీమీద దెయ్యంలా కూర్చుంటుంది. దెయ్యం యేం కోరుతుంది? తే-తే- కుంభం పొయ్యి అని కోరుకుంటుంది. అధికార దెయ్యం కోరేది, డబ్బూ, తాగుడూ, ముండే కాదు. దెయ్యం మనిషిని-మాటా, నడతా, జీవితవిధానం-అన్నిటిలోనూ చెడుదారులను పట్టిస్తుంది. ఆ దెయ్యం, ఆ మినిష్టర్ని, పోలీసుని, ఆఫీసర్ని, స్టేషను మాష్టరినీ, యీ హెడ్ కానిస్టేబుల్‌నీ ఆ కళ్ళద్దాల మనిషినీ, మీ అందరినీ ఆవరించింది. రాజకీయాల్లోనూ, ఉద్యోగుల్లోనూ, విద్యార్థుల లోనూ యిక్కడా అక్కడా కాదు ప్రతిచోటా వుంది, ఆ దెయ్యం."

"అయితే బతకడ మెలా?" ప్రశ్నించా డొక ముసలాయన.

"నేనేం చేసాను చెప్పండి?"

"లంచం తిన్నావు."

"నా పై అధికారిని ధిక్కరించినందుకు ఆమాత్రం తృప్తివద్దా? లంచం తిని మేలు చేసానా? కీడు చేసానా?" అన్నాడు హెడ్.

"అమ్ముకున్నోడికి మేలు చేసావు— నాకు కీడు చేసావు" అన్నాడు వేణుగోపాలన్.

"అమ్ముకునేవాళ్ళు అంతమంది—వాళ్ళకు ఆ పూటకు రెక్కాడితే డొక్కాడుతుంది. మీరు రెక్కాడక పోయినా డొక్క కోసం నిల్వుంచుకున్నారు. ప్రపంచంనిండా మోసం, దగా, కీడు, పాపం—వుంది. లేదన్నవాడు కళ్లు మూసుకుని మాటాడు తున్నాడు. అధికారం వున్నవాళ్ళంతా యెంచుకోడానికి యేం మిగిలింది? మాటాడరేం? చెప్పండి."

ఎవరూ మాటాడలేదు. రైలు ఈలవేసింది.

"ఏది తక్కువ పాపమైతే దాన్నే అధికారి యెంచుకుంటాడు. దాన్నే న్యాయం అంటాడు. యథాప్రజా—తథారాజా" అంటూ హెడ్డు మెల్లగా కదులుతున్న రైలుబండి నించి దిగి పోయాడు.

పదమూడో నెంబరు బస్సు

కొండిపాటి విజయలక్ష్మి



కొత్త సినిమా రిలీజయింది. మా ఆవిడ ఉదయం నుంచీ ఒకటే హడావుడి పడిపోయింది. సినిమా వచ్చిన రోజే చూసెయ్యాలి. చాలా మందిలా ఆమెకీ అదొక గొప్ప. సాయంత్రం ఆరు గంటల ఆటకు వెళ్ళిపోవాలనే ఆరాటం ఒకచోట నిలవకుండా, కూర్చోకుండా ఏదోపని చేస్తూ పిల్లల్ని కసురుకుంటూ తిరిగేస్తూంది ఇల్లంతా

నిన్ననే మా మరదళ్ళు నలుగురు ఎక్కెడెక్కడ వున్నవారూ కట్టకట్టుకుని అక్కను చూడాలని చుట్టరికానికి వచ్చారు. అందులో ఒక మరదలు బీహార్‌నుంచి, ఇంకొక మరదలు ఒరిస్సానుంచి, ఓ మరదలు మధ్యప్రదేశ్‌నుంచీ, వచ్చారేమో, తెలుగు సినిమా చూడాలని కుతూహలపడుతున్నారు. 'బావగారూ టిక్కెట్లు దొరుకుతాయా?' అని ఒకామె అడిగితే, 'తొందరగా ఆఫీసునుంచి వచ్చెయ్యండి బావగారూ!' అని మరొక మరదలంది. 'మీరు వెళ్ళి రారాదూ,' అన్నాను మా ఆవిడతో నెమ్మదిగా. దానికావిడ బుంగమూతి పెట్టి అలుక ప్రకటించింది. 'పొల్లెండి మా వాళ్ళంటేనే మీకు అలుసు. మీరు లేకుండా నే నెప్పుడన్నా సినిమా చూశానేమిటి? మానేస్తాం లెండి. టిక్కెట్లు తియ్యలేం బాబూ!' అని.

'సరే వచ్చేస్తాలే. సాయంత్రం ఐదు గంటలయ్యేసరికి తెమిలిపొండి' అని చెప్పి ఆఫీసుకి ఆవాళ అరగంట లేటుగా వెళ్ళి అరగంట ముందుగా ఇంటికి వచ్చేశాను. మా ఆవిడ, మరదళ్ళు అందాలపోటీకి వెళ్ళేవాళ్ళలా తయారయి వున్నారు. కాఫీ టిఫిను ఆదరాబాదరా అయ్యిందనిపించి పదండి అని వీధివరండాలోకి వచ్చాను

మా ఆవిడ బస్ చార్జీలకు సినిమా టిక్కెట్లకు ఇవిగో డబ్బులు అని నా జేబులో కొన్ని రూపాయల కాయితాలు కూరింది.

ఇంటికి తాళంపెట్టి బస్‌స్టాప్ వైపు నడక ప్రారంభించాము. మా మరదళ్ళు గలగల నవ్వుతూ మాట్లాడుతూ నాతో నడుస్తూంటే, నేను డిగ్నిటీతో, సీరియస్‌గా, హుందాగా, వుండటానికి ప్రయత్నిస్తున్నాను.

తల రేపుకొందని, ముఖాన్ని అద్దిన పౌడరు తుడిచేసుకుంటుందనీ, మా అమ్మాయిని సన్నగా మొట్టి మందలిస్తూంది మా ఆవిడ. నాకు చిరాకేసింది. అక్కడ మా పిల్లల ముఖాలెవరు చూస్తారు? అన్ని ఊళ్ళలో సంగతి నాకు తెలియదు కాని మా విశాఖపట్నంలో మట్టుకు కొత్త సినిమా రిలీజు అయిన రోజే చూసెయ్యాలనే యావ చాలామందికి వుంది. సినిమా

బాగుంటుందా, బాగుండదా అనే విషయం ఎవరూ ఆలోచించరు. ఒకసారి చూసెయ్యాలి, అదీ మొట్టమొదటిరోజు చూసెయ్యటం మరీ గొప్ప. సినిమా బాగుందంటేఎన్నిసార్లు చూస్తే అంత గొప్ప కొందరికి.

కొంచం దూరంలో నా వెనక్కి నడుస్తున్న మా ఆవిడ అరిచినట్టు చెబుతోంది 'ఏమండోయ్ డబ్బు జాగ్రత్త టిక్కెట్లు దొరక్కపోతే బ్లాకునన్నా కొనెయ్యండి' అని.

'ఆఁ మహా జాగ్రత్తయిన మనిషివి చెప్పొచ్చావు' కసురుకున్నాను ఆవిడమీద.

బస్‌కోసం నిరీక్షిస్తూ క్షణమో యుగంలా గడుపుతూ బస్ స్టాపులో నిల్చున్నాం. క్షణానికోసారి చేతులకున్న గడియారాల్లో టైమ్ చూసుకుంటున్నారు మరదళ్ళు. నాకూ అలా బస్ కోసం వెయిట్ చెయ్యటం చిరాగ్గానే వుంది. టైము ఆరు గంటలయ్యింది.

పదమూడో నెంబరు బస్సు కిటకిటలాడే జనంతో వచ్చి ఆగింది. ఆ బస్సులో పడాలే కాని అది ఏరోప్లైనులా పరిగెత్తుంది. మా మరదళ్ళకి కూడా బస్సు ఎక్కటంలో మంచి తర్ఫీదు వున్నట్లుంది. ఆ జనంలో దూరిపోయారు. మా ఆవిడా పిల్లలూ ఎక్కేశారు. తర్వాత నేనూ ఎక్కాను. బస్సెక్కాక మా వాళ్ళెక్కడ వున్నారో నాకు కనుపించలేదు. అస్సలు వాళ్ళెక్కడ వున్నారో చూసే అవకాశమే లేదు. మా ఆవిడ ముందే చెప్పింది 'ఎవరి టిక్కెట్లు వాళ్ళం కొనేసుకుంటాం బస్సు రష్‌గా వుంటుంది మీ టిక్కెట్టు మాత్రమే కొనుక్కోండి' అని.

గజం పట్టుకు వేళ్ళాడుతున్నాను ముందు వెనుక నిల్చున్న జనం ఎటు తోస్తే అటు జరుగుతూ.

నా ముందు నాకు దగ్గరగా నా వైపే తిరిగి నిల్చున్నాడు ఒక సూటు వ్యక్తి. ఖరీదయిన సూటులో ఘరానా వ్యక్తిలా వున్నాడు. సెంటు వాసన గుబాళిస్తూంది. బస్సు గాలితో పోటీ పడుతూ పరిగెడుతూంది. మేం చూడబోయే సినిమా గురించి ఆలోచిస్తున్నాను.

నా చెంప ఛెళ్ళుమంది, జేబులో చెయ్యిపెట్టి డబ్బు లాగేసినట్లయింది.

ఇంచుమించు రెండూ ఒకేసారి జరిగాయేమో. 'కండక్టరుగారూ చూడండి నా జేబు కొట్టేశాడు దొంగ వెధవ' అని నా కాలరు పట్టుకున్నాడు సూటు వ్యక్తి.

నేను ఎంతో నిజాయితీగా మెసులుకుంటూ ఆఫీసులో మంచిపేరున్న నేను దొంగవెధవనా? దిమ్మెరపోయాను. ఎవరి డబ్బు ఎవరు తీశారు. ఎవరు దొంగవెధవ. నాకంతా అయోమయంగా వుంది. అప్రయత్నంగా నా జేబుమీదికి నా చెయ్యి వెళ్ళిందో మళ్ళీ నా చెంప ఛెళ్ళుమంది. ముఖం జుమాల్‌మంది. కళ్ళు చీకట్లు కమ్మినట్లయాయి.

దొంగ రాస్కెల్ దింపండి క్రిందకు. బస్సులో కలకలం. నా వళ్ళు హూనమయిపోతూంది.నా చెంపలు కందిపోతున్నాయి. నేనేమో చెప్పాలనుకుంటున్నాను. నన్నెవరూ మాట్లాడనివ్వటం లేదు. 'నేను దొంగను కాదు.' అనే నా మాట ఎవరూ వినిపించుకునేట్టు లేరు. ఇంత గందరగోళం జరుగుతూంటే నా భార్యా మరదళ్ళు ఎందుకు జోక్యం పెట్టుకోలేదో నాకు అర్థంకావడం లేదు. నేను సిగ్గుతో చచ్చిపోతున్నాను.

సూటు వ్యక్తి చకచకా రూపాయల కాయితాలు లెక్కెట్టుకుంటున్నాడు అంత రష్‌లోనూ.

నేను దొంగను కాను అని అరవబోయినా నా నోరు అతని చేతిలో మూతబడింది. ఎవరో నా మెడమీద చెయ్యేంచి ముందుకి తోశారు. బస్సాగింది. నన్ను క్రిందికి తోసేశాడు. నా జేబులోని డబ్బు కొట్టేసి నా చెంప ఛెళ్ళుమనిపించి నన్ను దొంగ వెధవను చేసి బస్సు దింపాడా? ఎంత దారుణం! కలో వాస్తవమో తెలియని పరిస్థితి క్షణం. ఇది కల అయితే బాగుండుననిపించింది మళ్ళీ కాని ముఖమంతా మంటగా, నొప్పిగా, పచ్చిగా వుంది. మెడ జవలు సలుపుతున్నాయి. నన్ను దింపిన బస్సు రయ్యిన దూసుకుపోయింది. వెధవబస్సు. కసిగా తిట్టుకున్నాను.



బస్సులో వుండి ఏ రకంగానూ ఆదుకోని నా భార్యా మరదళ్ళమీద కోపంతో జగదాంబ సినిమాహాలు వైపు నడిచాను

మా పరాలమంతా అక్కడ నా కోసమే చూస్తూ నిల్చున్నారు నా చెంపలు వాచి ముఖం వుబ్బివుంది కాబోలు మా ఆవిడ నన్ను చూస్తూనే 'అదేమిటండీ ముఖమలా వుంది? మీరెక్కడ దిగిపోయారు? ఇంతాలశ్యం చేశారేమిటి? ఇవ్వాళ ఇహ టిక్కెట్టు దొరకటం సినిమా చూడటం పట్టిదే' అంది. సినిమా చూడటం పడదేమో అనే బాధ నేను అలక్ష్యం చేశాననే కోపం మిళితమై ధ్వనించాయా గొంతులో మరదళ్ళు నిరుత్సాహంగా కాస్త విసుగ్గ చూశారు నా వైపు

నాకు గొంతునిండా కోపం వచ్చింది వళ్లు మండిపోయింది. 'నువ్వెక్కడ చచ్చావ్?' అన్నాను గొంతు చించుకుని అరిచినట్టు.

"అదేమిటండీ అలా కోపగించుకుంటారు? ఆ బస్సులో ఏ మనిషి ఎక్కడ వున్నారో చూసే అవకాశముందా? మేమంతా ముందున వున్నాం మీరు వెనకున్నారాయె అందులో ఎవడో దొంగ వెధవ ఎక్కి ఎవరి డబ్బులో కొట్టేశాడు కూడాను. అయినా మీ రెందుకు ముందు 'స్టాపు'లో దిగిపోయారు? వెళ్ళి టిక్కెట్ల సంగతి చూడండి" అంది మా ఆవిడ.

బావగారికి కోపం వచ్చిందిలా వుందే! అక్క ముఖమెర్రగా వుంది. వాళ్ళ అక్కతో గుసగుసలాడుతూంది మా మరదలు.

అసలు జరిగిన విషయం ఎలా ఏమని ప్రారంభించి ఎలా ముగించాలో తెలియక 'వెధవ సినిమా పదండి పోదాం' అన్నాను నేను.

"అదేమిటండీ అలా అంటారూ! ఇంత దాకా వచ్చాక, ఇంటిలో ఏమొచ్చిందండీ ముఖమలా తేనెటీగలు కుట్టినట్టు కందవెట్టుకుంటారూ!' నింద నిష్ఠూరం మాట సాగదీసింది మా ఆవిడ.

నాకు నేను మహా తెలివయినవాణ్ణనీ, నన్నెవరూ సులువుగా మోసగించలేరనీ నమ్మకం సరిగ్గా నాలుగురోజుల క్రితమే, మా ఆవిడ నాకు తెలియకుండా ఇంటి ఖర్చుల కిచ్చిన డబ్బుల్లో మిగుల్చుకుని, ఫారెన్ నైలక్స్ చీరకని ఇన్‌స్టాల్‌మెంటు బేసిస్‌లో చేరి నెలకు పదిరూపాయలు చొప్పున కట్టి డెబ్బయి రూపాయలు మోసపోయిందని తెలిసింది ఆ ఏణ్ణి పడ చీవాట్లేశాను.

"మీ ఆడవాళ్ళంతా ఇంతే బుద్ధులుండవు. మధ్య మహ తెలివయినవాళ్ళలా పోజులు కొడతారు'' అని ఆరోజంతా ఆమెను సాధించాను.

"వాడెంతగా నమ్మించాడో మీకు తెలియదు లెండి. నేను ఒక్కదాన్నే కట్టేనేమిటి? కావాలంటే అడగండి మన వీధిలో ఎంతమంది కట్టేరో? కలెక్టరాఫీసు గుమాస్తాగారి భార్య శారదమ్మగారికి రెండు ఇనిస్టాలుమెంట్సుకే చీర వచ్చింది. పార్వతమ్మకీ వచ్చింది మంచి చీర, నలభై రూపాయలకి" అని ఇంకా ఆమె ఏమో చెప్పబోతుంటే 'అస్సలు నువ్వే నన్ను మోసం చెయ్యాలని చూశావు కదే' అని మండిపడ్డాను,

'చెబితే మీరు వప్పుతారుటండీ. ఎప్పుడన్నా వందరూపాయలు చీరకివ్వటానికి సాహసించారా?' ధైర్యం చిక్కబట్టుకుని అడిగేసింది. నాకు రోషం వచ్చి రెండు తగలనిచ్చాను.

"నీ బాబుని పెద్ద కట్నమిచ్చి ఏ ఐ ఏ.ఎస్ ఆఫీసరుకో ఇవ్వమనలేకపోయావా? కొనేవాడు. నైలక్సు చీరలు, కారుల్లో తిరిగేదానవు. రెండువేల కట్నంతో ఈ ముష్టివెధవ నెందుకు పెళ్ళాడావు? వంద రూపాయల చీర కట్టే ముఖమా నీది? నువ్వే అదృష్టవంతురాలివయితే ఈసరికెప్పుడో ప్రమోషను వచ్చేది నాతో చేసేవాళ్ళంతా తాశీల్దారులూ, రివెన్యూ ఇన్‌స్పెక్టర్లూ, డిప్యూటీ తాసీల్దార్లు అయిపోతే నేను ఓ దరిద్రగొట్టుని కట్టుకోవడం వలన ఆ గుమాస్తా వుద్యోగంలోనే గాడిద చాకిరీ చేస్తూ వుండిపోయాను. ఈ ఇరుకిల్లు చాలీచాలని తిండి బట్టా ఇదంతా నాకెలా ప్రాప్తించిందనుకున్నావు! నీవలన మోసపోతానేమో! మగవాడ్ని అడిగి చెయ్యాలి ఏ పని అయినా అనే జ్ఞానం వుండొద్దూ? ఆడపెత్తనం మంగలి బాజా అన్నారందుకే. ఈసారెప్పుడన్నా, గిన్నెలు, చీరలూ అని అడ్డమయిన వెధవల్నీ నమ్మి డబ్బు కట్టు, డొక్క చీల్చేస్తాను ఇప్పుడు తెలుసుకున్నాను ఇంటి ఖర్చులకని నా దగ్గర డబ్బులు గుంజి దాచగల జాణవని. ఈసారి ఎప్పుడన్నా ఇలాటి వెర్రి వెధవ పనులు చేశావా! చూడు నీ బాబు దగ్గరకు పంపించేస్తాను' అని వార్నింగిచ్చాను.

అప్పటికి మామగారుపోయి నాలుగేళ్ళయింది లెండి. నేను ఎన్ని మాటలన్నా ఆమె కిమ్మనలేదు. గుడ్లనీరు కుక్కుకుంటూ మౌనం వహించింది. ఆ విషయం అక్కడితో వదలలేదు నేను. నిన్న మరదళ్ళతో మా ఆవిడ తెలివితక్కువగా మోసపోయిందని ఆ కథ చిలవలు పలవలు అల్లి చెప్పి మా ఆవిడని చిన్నబుచ్చాను. మా ఆవిడకు వుడుకుమోత్తనమొచ్చిందిలా వుంది. "మీరెప్పుడన్నా మోసపోతే తెలుస్తుంది నన్ను సాధించటం కాదు" అంది వుక్రోషంగా ఆమె శాపం తగిలిందేమో జరిగిన మోసం తలుచుకుంటూ ఆ ఆశ్చర్యం నుంచి తేరుకోలేకపోతున్నాను. నా జేబులో డబ్బులు తీసి నన్ను దొంగ వెధవా అని చెంపదెబ్బకొట్టి, నా జేబులోంచి తీసిన డబ్బులు అణాపైసలతో లెక్కేట్టేసుకొని నీ జేబులో డబ్బులెన్ని వున్నాయో చెప్పు అని దబాయించి, నా డబ్బులు యితనే తీశాడు అని నేను చెప్పబోయేంతలో నా నోరు మూసి అస్సలు నన్ను మాట్లాడకుండా బస్సు దింపివేసిన అతను మామూలు మనిషా! అందరి దృష్టిలో ఖరీదయిన సూటులో వున్న అతను పెద్దమనిషి. సాధారణ దుస్తుల్లో వున్న నేను దొంగను.

"టిక్కెట్టు తియ్యరా? అలా చూస్తారేమిటండీ!" అంది మా ఆవిడ మళ్ళీ.

"వెధవ సినిమా వెర్రి, పద ఇంటికి" అన్నాను అస్సలు విషయం ఎలా చెప్పటమో తెలియక మాట నమిలేస్తూ. రేపీ విషయం ఆఫీసులో తెలిస్తే అందరూ తన్ను ఎగతాళి చేస్తారు. ఎలా? ఇక్కడితో ఈ క్షణంలో నా జీవితం ముగిసిపోతే బాగుండుననిపించింది. ఆఫీసువాళ్ళు ఎందుకు నవ్వరూ! అందులోనూ శర్మ మరీ సంతోషంగా పగలబడి నవ్వుతాడు నీకీ శాస్తి కావాలిలే అని కసిగా నవ్వుతాడు. ఓసారి శర్మ ఐదు రూపాయల కాయితం దాచేసి అతన్ని ఏడిపించాను.

అవ్వాళ శర్మ ఆదరా బాదరా ఆఫీసుకు ఆలస్యంగా వచ్చాడు. చిరునవ్వుతో విష్‌చేసి ఆలస్యానికి కారణం అడిగాను. 'మా ఆవిడ

వూరికెళ్ళింది వంట అయ్యేసరికి ఆలస్యమైంది' అన్నాడు శర్మ.

"హోటల్‌కి పోలేకపోయేవుటయ్యా" అని నేనంటే, నా ప్రక్కనే కూర్చున్న వెంకటేశం 'అయ్యో రెండు రూపాయలు పెట్టి హోటలు కెళతాడుటోయ్! కావాలంటే భోజనం మానేస్తాడు కాని' అన్నాడు. అందరూ ఘొల్లున నవ్వారు.

శర్మ ముఖం చిన్నబోవటం నేను గమనించాను. 'రా కూర్చో ఏం వండుకున్నావు?' అన్నాను నవ్వేస్తూ.

అతను జవాబివ్వలేదు. సీరియస్‌గా సీటులో కూర్చుంటూ జేబులోంచి రుమాలుతీసి ముక్కు తుడుచుకున్నాడు అతనికి ఎప్పుడూ జలుబే అదొక జబ్బు. దానినుంచి ఎప్పుడూ అతను చిరచిరలాడుతూ వుంటాడు. అతను రుమాలు జేబులోంచి తీసేప్పుడు అతని జేబులోంచి ఐదు రూపాయల కాయితం జారి దిగువున పడింది. అది నా కంట పడింది. నెమ్మదిగా వ్రాస్తూన్న కాయితం జారవిడిచి ఆ కాయితం తీసే నెపంతో ఐదు రూపాయల కాయితం తీసి డ్రాయరు మీదున్న పత్రిక మధ్య దాచి ఏమీ తెలియనట్లు నా పని నేను చూసుకోవటం మొదలుపెట్టేను.

శర్మ బాత్‌రూం కెళ్ళినప్పుడీ విషయం నాకో గుమస్తాలకి చెప్పి ఆట పట్టిద్దాం అని ప్లాను వేశాను. మరో అరగంట తర్వాత శర్మ చూసుకున్నాడు జేబు. అందులో ఐదు రూపాయల కాయితం కనిపించక కంగారుపడటం మొదలు పెట్టేడు.

అప్పుడు ఎంతగా ఆనందించాం! 'అమ్మో ఐదు రూపాయలే!' అని ఒకడంటే 'అంత డబ్బు నువ్వు ఆఫీసుకు తేవటం ఆశ్చర్యంగా వుంది. వుత్తదే తెచ్చి వుండవు' అని మరొకరు. బాత్‌రూమ్‌కి వెళ్ళి పంట్లాంవిప్పి సరిగ్గా చూసుకోవయ్యా అని నేనన్నాను. పాపం శర్మ నిజంగా అలా చూసుకుని వచ్చి నవ్వుతూన్న మా అందరి వైపు చూసి 'ఎవరికన్నా దొరికిందా?' అడిగాడు.

'దొరికితే ఇంతసేపా! సరే నీ ఐదు రూపాయలూ వెతికి యిస్తే మా అందరికీ, పోనీ నాకు వెంకటేశానికి టీ యిప్పిస్తావా?' అడిగాను. శర్మ లోభి. ఎప్పుడూ తను ఆఫీసులో, కాఫీ, టీ లాటివి తీసుకోడు. ఎవరికీ ఇప్పించడు.

"సరే యిస్తాను. వెతికివ్వండి" అన్నాడు కూర్చీ సీట్లో కూర్చుంటూ మేమెవరమో తీశామనే నమ్మకం రావటంతో నిబ్బరంగా.

పత్రికలో కాయితం ఒక్కొక్కటే తిరగెయ్యి అన్నాను నేను. శర్మ అలానే చేశాడు. అందరూ విరగబడి నవ్వారు. ఐదు రూపాయల కాయితం దొరికిన శర్మ 'టీ'లు తను వద్దన్నా తెప్పించాడు. 'నువ్వూ ఓ కప్పు తాగవయ్యా! ఐదు రూపాయల కాయితం కోసం వెతికి అలసిపోయావు" అన్నాను నేను. అయినా శర్మ 'టీ' తాగలేదు. రోజుమొత్తంలో శర్మను తను ఏదో వేళప్పుడు ఎగతాళిచేసి అందరూ నవ్వుతూంటే బుజాలెగరేసి తనూ నవ్వుతాడు. ఆ శర్మ యివ్వాళ విషయం తెలిస్తే ఎంతగా నవ్వుతాడు! అయినా ఈ విషయం నేను గుట్టుగా వుంచాలి. ఎవ్వరితో చెప్పకూడదు. బస్సు దిగివస్తుంటే దారిలో డబ్బు జారిపోయిందని చెప్పాలి అని నేను అనుకునేంతలో మా నాలుగేళ్ళ రెండవ అబ్బాయి అన్నాడు.

"అమ్మా! నాన్ననేమో బస్సులోవాళ్ళు కొట్టాలే" అని.

"ఛీ వెధవ! నోరు ముయ్యి" అన్నాను.

మా మరదళ్ళకి అర్థమయిపోయింది. పెదవుల మధ్య నవ్వు బిగబడుతూ "బావా! డబ్బు పోయిందా?" అడిగారు.

ఏమని చెప్పను? వెధవ పదమూడో నంబరు బస్సు ఇహ జన్మలో ఎక్కకూడదు అనుకున్నాను.